సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 20 । నవంబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళాలు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అన్నదానానికి కర్రి సాయిలీల (రావులపాలెం) తొలి జీతం రూ.27,350, కర్రి నందన విశ్వనాథ్ (అమెరికా) రూ.20,232 చొప్పున విరాళాలు సమర్పించారు.



రూ.లక్ష విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కోకా విజయలక్ష్మీ శేషకుమారి (కాకినాడ) ఆదివారం దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్ర మోహన్‌కు రూ.లక్ష విరాళం అందజేశారు.

డెల్టాలకు 7 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు ఆదివారం 7 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 1,600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ అమ్మవారు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల విక్రయాల ద్వారా అమ్మవారికి రూ.64,830 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి

ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్




సభలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్

అమలాపురం టౌన్: పుస్తక పఠనంపై నేటి విద్యార్థులకు మరింత ఆసక్తి పెరగాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్‌ఎన్‌ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. అందుకు విద్యార్థులు గ్రంథాలయాలను విధిగా వినియోగించుకుని, ఖాళీ దొరికినపుడు పుస్తకాలు చదివేందుకు సమయం కేటాయించాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం అమలాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు నాలుగు గోడల తరగతి గదుల్లో కూర్చుని సముపార్జించే విజ్ఞానానికి సార్థకత రావాలంటే పుసక్త పఠనం అలవర్చుకోవాలన్నారు. కాలం ఎంతటి ఆధునికతవైపు వెళ్తున్నా గ్రంథాలయాల విలువ శాశ్వతమైనదని అన్నారు. అనంతరం దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి, మహిళా సాధికారతపై జరిగిన సభలో సమాజంలో మహిళలు సాధిస్తున్న విజయాల పరంపరను ప్రసాద్ వివరించారు. గ్రంథాలయాధికారి పోలిశెట్టి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో స్థానిక సాయి సంజీవిని మహిళా వాకర్స్ యోగా ఆరోగ్య సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, సామాజిక కార్యకర్త మొహబూబ్ షకీలా తదితరులు ప్రసంగించారు.

నేడు కలెక్టర్, ఎస్పీ సంయుక్త స్పందన

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ఎస్పీ పి.జగదీష్‌తో కలసి సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. డివిజన్, మండల, గ్రామ సచివాలయ స్థాయి స్పందన కార్యక్రమం కూడా యథావిధిగా జరుగుతుందన్నారు. డివిజన్, మండల స్థాయి అధికారులందరూ ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉండి, అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు



అంతర్వేదిలో స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కార్తిక మాసం, ఆదివారం సెలవు కావడంతో స్వామి దర్శనానికి పిల్లాపాపలతో వచ్చారు. ఆలయంలో నిర్వహించే సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 7 వేల మంది స్వామి వారి ప్రసాదం స్వీకరించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అయినవిల్లి గణపతి దర్శనానికి భక్తుల బారులు

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యాన స్వామి వారికి మేలుకొలుపు సేవ, అనంతరం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమంలోను అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి గరిక పూజ నిర్వహించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 146 మంది భక్త దంపతులు, ప్రత్యేక దర్శనంలో 1,010 మంది, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 38 మంది పాల్గొన్నారు. నూతన వాహనాలకు 29 మంది పూజలు చేయించుకున్నారు. చిన్నారులకు నామకరణాలు, అక్షరాభ్యాలు, తులాభారం వంటి ప్రత్యేక కార్యక్రమాలను 30 మంది నిర్వహించారు. స్వామి వారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,56,591 లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పక్కాగా కులగణన

- చరిత్రాత్మక ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం
- పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల ప్రణాళికలు
- ఇప్పటికే కుల సంఘాల అభిప్రాయాల సేకరణ
- తాజాగా మార్గదర్శకాల విడుదల



కలెక్టరేట్‌లో మాస్టర్ శిక్షకులకు అవగాహన కల్పిస్తున్న జేసీ తేజ్‌భరత్ (ఫైల్)



శిక్షణలో పాల్గొన్న అధికారులు (ఫైల్)

సాక్షి, రాజమహేంద్రవరం: సమగ్ర కులగణన ద్వారా అన్ని వర్గాల అభ్యున్నతికీ బాటలు వేయాలన్న తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశంలోనే ఎక్కడా జరగని విధంగా బృహత్తర ప్రక్రియ అయిన కులగణనకు రాష్ట్రంలో శ్రీకారం చుట్టింది. కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణకు ఉపక్రమించింది. ఈ క్రమంలో ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రవ్యాప్తంగా 5 గ్రామాలను ఎంపిక చేసింది. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి కుల సంఘాలు, మేధావుల అభిప్రాయాలు సేకరిస్తోంది. తాజాగా కులగణనకు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ ప్రక్రియ జరగాల్సిన తీరు, సేకరించాల్సిన అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో శనివారం శిక్షణ ఇచ్చారు. పలు విషయాలపై సూచనలు, సలహాలు అందించారు.

సమగ్ర సమాచార సేకరణ

- ఏ సామాజిక వర్గాలకు చెందిన వారు ఎంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు సమగ్ర కులగణన చేపడుతున్నారు.
- ఇందులో సదరు కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలు సేకరిస్తారు. మొదట ఆ కుటుంబం నివసిస్తున్న జిల్లా, మండలం, గ్రామం వివరాలు సేకరిస్తారు. అనంతరం కుటుంబ పెద్ద, ఇంటి చిరునామా, గృహ వివరాలు, ఎంతమంది నివసిస్తున్నారనే వివరాలు నమోదు చేస్తారు. ఈ–కేవైసీకి లోబడి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తారు.
- సచివాలయ ఉద్యోగి, గ్రామ వలంటీర్ కలిసి ఇంటింటి సర్వే కచ్చితంగా చేపట్టాలి. సర్వే ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ ఒకే మొబైల్ ఫోన్ వినియోగించాలి. సర్వేకు కుటుంబ సభ్యుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.
- వీరికి ఇప్పటికే బయోమెట్రిక్/ఐరిస్/ఫేషియల్ గుర్తింపు పరికరాలు అందించారు. మొబైల్ అప్లికేషన్‌లో స్క్రీన్ షాట్లు, వీడియో రికార్డింగ్‌లు అనుమతించరు.
- సర్వే ప్రక్రియ, సాంకేతిక అంశాలపై మాస్టర్ శిక్షకులు అవగాహన కలిగి ఉండాలి. సందేహాలుంటే నివృత్తి చేసుకుని, మండల, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి.
- జిల్లా స్థాయిలో టెక్నికల్ నోడల్ అధికారి, సహాయ అధికారులను నియమించారు. ఎప్పటికప్పుడు సాంకేతిక సమస్యలను అధిగమించేందుకు వీరు సహాయం చేస్తారు. ప్రత్యేక యాప్ ద్వారా డేటా ఎంట్రీ చేపడతారు. దీనిపై సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలి.
- కార్యదర్శులను క్లస్టర్ల వారీగా విభజించి వారికి వలంటీర్లను అనుసంధానం చేస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, తహసీల్దార్, ఎంపీడీఓ వంటి మండల స్థాయి అధికారులను భాగస్వాముల్ని చేస్తున్నారు. డివిజన్, జిల్లా అధికారుల పర్యవేక్షణలో వలంటీర్ అప్లికేషన్ ద్వారా సర్వే నిర్వహిస్తారు.
- ప్రతి వ్యక్తి పేరు, వయసు, లింగం, భూమి (వ్యవసాయ–వ్యవసాయేతర), ఇంట్లోని పశువులు, వృత్తి, అన్ని రకాలుగా వచ్చే ఆదాయం, కులం, ఉప కులం, మతం, విద్యార్హత, నివాసం ఉండే ఇల్లు, మంచినీటి సదుపాయం, టాయిలెట్లు, గ్యాస్ ఉందా? లేదా? అనే వివరాలు సేకరించాల్సి ఉంటుంది.
- ఎనిమిదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లల వివరాలు సేకరించాలి. ఒక్కరే ఉన్న ఇంట్లో, మొత్తం కుటుంబం చనిపోయినట్లయితే, సర్వే నిర్ధారణ కోసం సెక్రటేరియట్ ఉద్యోగి తప్పనిసరిగా ఈ–కేవైసీ ఇవ్వాలి.

5 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా..

రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లోని 5 గ్రామాల పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా కులగణన నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ప్రతి డివిజన్, మండల అధికారులు 200 ఇళ్లను సందర్శించాల్సి ఉంటుంది. ఆయా మండలాల్లో సర్వే పూర్తయిన గృహాల వివరాలను క్షేత్ర స్థాయి అధికారి లాగిన్‌కి అనుసంధానం చేస్తారు. అనంతరం ఏయే గృహాన్ని సందర్శించాలో ఎంపిక చేసుకుని వారు తనిఖీ చేయాల్సి ఉంటుంది. బయోమెట్రిక్, ఐరిస్, ముఖ గుర్తింపు, ఓటీపీ ద్వారా గృహాల సందర్శన సర్వే పూర్తి చేయాలి.

అపోహలొద్దు

కులాల వారీగా జనాభా, సామాజిక, విద్య, ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకు కులగణన దోహదపడుతుంది. ఈ ప్రక్రియపై కొందరు అపోహ పడుతున్నారు. ఆధార్, తమ వివరాలు వెల్లడిస్తే పథకాలు తొలగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. అటువంటి వాటికి ఎలాంటి ఆస్కారమూ లేదు. యాప్‌లో నమోదు చేసే సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత ఉంటాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనను పారదర్శకంగా, పక్కాగా చేపట్టేందుకు అన్ని చర్యలూ తీసుకుంటాం. ఇప్పటికే కులగణన సర్వేపై మాస్టర్ శిక్షకులకు అవగాహన కల్పించాం.

– ఎస్.తేజ్‌భరత్, జిల్లా జాయింట్ కలెక్టర్

సిద్ధంగా ఉన్నాం



కులగణనకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ యుద్ధప్రాతిపదికన చేపడుతున్నాం. జిల్లాలో ఎప్పుడు సర్వే నిర్వహించాలన్నా సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే సిబ్బందికి మార్గదర్శకాలు అందించాం. సర్వేకు అవసరమైన అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం. సర్వేలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల పాత్ర కీలకం.

– ఎ.ముఖలింగం, సీపీఓ

మంచి భవితకే విద్యారంగంలో మార్పులు

- రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- బూరుగుపూడిలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో మౌలికమైన మార్పులు తీసుకువచ్చారని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి ద్వారకామాయి కల్యాణ మండపంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ, సమాజోద్ధరణలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని, అదే దృక్పథంతో ప్రభుత్వం ఉందని అన్నారు. అయితే రాష్ట్ర ఆర్థిక సమస్యల నేపథ్యంలో కొన్ని చిన్న సమస్యలు ఉత్పన్నమయ్యాయని, వాటిని ప్రభుత్వం పరిష్కరిస్తోందని చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నాడు–నేడుతో పాఠశాలలు ఎంతో మెరుగుపడ్డాయని అన్నారు. డీఎస్సీ–2023 వెంటనే అమలు చేయాలని, అలవెన్స్ బేస్డ్ ప్రమోషన్లను విరమించుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, గౌరవాధ్యక్షుడు వి.శంకరుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీచర్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వరరావు, అరుణకుమారి, సీఐటీయూ జిల్లా నాయకులు అరుణ్, కోరుకొండ మండలాధ్యక్షుడు జీవీ శివబాబు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ

ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.జయకర్, సహాధ్యక్షుడిగా ఐ.రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎ.షరీఫ్, సహ కార్యదర్శిగా ఎం.విజయగౌరి, కోశాధికారిగా ఈవీఎస్ఆర్ ప్రసాద్‌తో పాటు, తొమ్మిది మంది కార్యదర్శులను ఎన్నుకున్నారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలు

- ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ
- అట్టహాసంగా ఎస్‌జీఎఫ్ఐ లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం



వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు



క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్‌–14, 17, 19 ఆధ్వర్యాన జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల లాన్ టెన్నిస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ నాగమణి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడారులు స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడానికి ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లా ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యాన అండర్‌–19 జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు కాకినాడలో జరగనున్నాయని తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ, అండర్‌–14, 17 లాన్ టెన్నిస్ పోటీలు క్రీడా మైదానంలోని టెన్నిస్ కోర్టుల్లోను, అండర్‌–19 పోటీలు రాజేష్ టెన్నిస్ అకాడమీ ప్రాంగణంలోని టెన్నిస్ కోర్టుల్లోను జరుగుతాయని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథి పద్మశ్రీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీలకు 12 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్, ఒలింపిక్ సంఘ చీఫ్ ప్యాట్రన్ భామిరెడ్డి, ఏపీ లాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి కుమార్, హెచ్‌ఎం రంగారావు, పీడీలు రవిరాజు, బంగారాజు, శ్రీహరిరాజు, రాష్ట్ర పరిశీలకుడు బాబు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనకు బై

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: జనసేన, టీడీపీలకు మండలంలోని కొత్త తుంగపాడులో భారీ షాక్ తగిలింది. ఆ గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, ఎంపీటీసీ సభ్యుడు రౌతుల లక్ష్మీపతి ఆధ్వర్యాన గ్రామానికి చెందిన 150 మంది టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. రెండు రోజుల క్రితం ఇదే విధంగా నరేంద్రపురం నుంచి టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు భారీ ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరిన సంగతి విదితమే. కొత్త తుంగపాడులో జరిగిన కార్యక్రమంలో జక్కంపూడి రాజా మాట్లాడుతూ, ఇది ఆరంభం మాత్రమేనని, ఇదే విధంగా రోజుకో గ్రామం నుంచి వైఎస్సార్ సీపీలో పలువురు చేరుతారని అన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుస్థిర పాలనకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి అనేక మంది వైఎస్సార్ సీపీలో స్వచ్ఛందంగా చేరుతున్నారని చెప్పారు. జనసేనకు చెందిన కొంత మంది సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేసి, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అయితే ప్రజలు ప్రతి విషయం గమనిస్తున్నారని, వాస్తవాలు తెలుసుకుని, వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా 'జై జగన్, జై జక్కంపూడి' అంటూ పార్టీలో చేరిన కార్యకర్తలు చేసిన నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, కో కన్వీనర్ గండి నానిబాబు, నాయకులు అనదాస సాయిరామ్, త్రినాథరావు, ఉల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలోనే.. కలర్‌ఫుల్ ప్రింటింగ్

- చేరువలోనే ప్రింటింగ్ క్లస్టర్
- టైర్‌–2 సిటీల్లో ఇక్కడే తొలిసారి
- జపాన్ టెక్నాలజీ, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు
- రూ.15 కోట్ల పెట్టుబడి
- ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: అంతర్జాతీయ ప్రమాణాలతో.. కళ్లు మిరుమిట్లు గొలిపే మల్టీకలర్ ప్రింటింగ్ మనకూ అందుబాటులోకి వచ్చేస్తోంది. ఎక్కడో దూరంగా ఉన్న విజయవాడలో కానీ అందుబాటులో లేని అత్యంత ఆధునిక టెక్నాలజీ ఇకపై మన దరి చేరబోతోంది. రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటు, చొరవతో కాకినాడలోనే ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి వచ్చేస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు చేయూతనిచ్చేలా ఈ క్లస్టర్ సిద్ధమవుతోంది. టైర్‌–2 (రెండో శ్రేణి) నగరాల్లో రాష్ట్ర ప్రభుత్వం చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తోంది. వీటి ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే సంకల్పంతో పారిశ్రామిక క్లస్టర్లు తీసుకువస్తోంది. దీనిలో భాగంగా కాకినాడలో ఇప్పటికే ప్రింటింగ్ క్లస్టర్ పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ట్రయల్ రన్ జరుగుతోంది. మరోవైపు కాకినాడలోనే రైస్ క్లస్టర్, పాలిమర్ క్లస్టర్ కూడా సిద్ధమవుతున్నాయి. రాజమహేంద్రవరంలో ఫర్నిచర్ క్లస్టర్, మాచవరంలో డాల్ క్లస్టర్ల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తోడ్పాటు అందిస్తోంది.

తప్పనున్న దూరాభారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతో పాటు మండపేట, రామచంద్రపురం తదితర పట్టణాల్లో సుమారు 500 ప్రింటింగ్ యూనిట్లు ఉన్నాయి. అయినప్పటికీ వేల సంఖ్యలో మల్టీకలర్ డిజైనింగ్, ప్రింటింగ్, బైండింగ్, కటింగ్ వంటి భారీ ఆర్డర్లు ఉంటే ఇప్పటి వరకూ ఇక్కడి వారు దూరాన ఉన్న విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. దీంతో ఈ ప్రాంతం వారు ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొంటున్నారు. కాకినాడలో ప్రింటింగ్ క్లస్టర్ అందుబాటులోకి వచ్చాక ఇక్కడి వారికి విజయవాడ వెళ్లే బాధ తప్పుతుంది. ప్రింటింగ్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలూ కాకినాడలోనే లభించనున్నాయి. ఆ మేరకు వారికి వ్యయంతో పాటు సమయం కూడా కలిసి వస్తుంది.

అందుబాటులో అత్యాధునిక మెషీన్లు

- మల్టీకలర్ ప్రింటింగ్ ఈ క్లస్టర్ ప్రత్యేకత. జపాన్‌లో తయారైన ప్రింటింగ్, ఫోల్డింగ్, స్టేషనరీ, బైండింగ్, గమ్మింగ్, సీటీపీ, కటింగ్ తదితర 12 రకాల భారీ మెషీన్లు ఈ క్లస్టర్‌కు వచ్చేశాయి.
- జపాన్‌లో అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జీఎల్‌–37 అనే మెషీన్ కూడా ఈ క్లస్టర్‌కు చేరుకుంది. ఈ మెషీన్‌తో ఏకకాలంలో డబుల్ డమ్మీలు రూపొందించవచ్చు. కాకినాడ క్లస్టర్‌లో తప్ప రాష్ట్రంలో మరెక్కడా ప్రస్తుతం ఈ మెషీన్ అందుబాటులో లేకపోవడం విశేషం.
- వెబ్ మెషీన్లు కూడా ఈ క్లస్టర్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఒకేసారి లక్ష ఏ4 బ్లాక్ అండ్ వైట్ కాపీలు తీయడం ఈ వెబ్ మెషీన్ ప్రత్యేకత. 4 వేల ఏ4 షీట్లతో ప్లేట్ ప్రింటింగ్‌కు విజయవాడలో రూ.2 వేల నుంచి రూ.2,500 వరకూ వ్యయం అవుతూంటే అదే కాకినాడ క్లస్టర్‌లో రూ.1600 మాత్రమే అవుతుంది.

క్లస్టర్లతో ఉపాధికి ఊతం

క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి సదుపాయాల కేంద్రాలను (కామన్ ఫెసిలిటీ సెంటర్లు) ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువస్తోంది. ఒకేచోట అన్ని రకాల సేవలూ అందుబాటులో ఉంచడం ద్వారా ఒక్కో పనికి ఒక్కో ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా చేయాలనేది ప్రభుత్వ సంకల్పం. ఇందుకు అనుగుణంగానే క్లస్టర్లు ఏర్పాటు చేస్తోంది. ఈ క్లస్టర్ల ఏర్పాటుకు రెండు రకాల రాయితీలు అందిస్తోంది. మొదటి కేటగిరీలో 10 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, రెండో కేటగిరీలో 20 సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. మొదటి కేటగిరీ రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లు, రెండో కేటగిరీ క్లస్టర్‌ను రూ.10 కోట్ల నుంచి రూ.30 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం దాదాపు నిర్మాణం పూర్తయిన కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ రెండో కేటగిరీలో సుమారు రూ.15 కోట్లతో ఏర్పాటైంది. దీనిలో కేంద్రం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం చొప్పున రాయితీ సమకూరుస్తున్నాయి. ఈ క్లస్టర్‌లో ఒకేసారి 200 మంది ప్రింటర్లకు సరిపడా సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇంతటి భారీ స్థాయిలో ప్రింటింగ్ క్లస్టర్ రావడం జిల్లా పారిశ్రామిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని పలువురు అంటున్నారు.

వ్యయప్రయాసలు తప్పుతాయి



రాష్ట్రంలో మరెక్కడా లేని సాంకేతిక పరిజ్ఞానంతో మల్టీకలర్ ప్రింటింగ్ ఇక్కడ అందుబాటులోకి రావడం చాలా గొప్ప విషయం. ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కొని విజయవాడ వెళ్లాల్సిన అవసరం కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్ ఏర్పాటుతో తప్పుతుంది. విజయవాడ వెళ్తే ఒక రోజు వృథాగా పోయేది. దాదాపు అన్ని మెషీన్లూ వచ్చేశాయి. ఒకే ఒక్క మెషీన్ జపాన్ నుంచి రావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం రెండో విడత నిధులు విడుదల చేస్తుందని ఎదురు చూస్తున్నాం. ఈ క్లస్టర్‌లో కామన్ ఫెసిలిటీ సెంటర్‌తో ఉత్తమమైన సేవలు అందుబాటులోకి వస్తాయి. ఈ క్లస్టర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తొలి నుంచీ ఎంతో ప్రోత్సహించి, రాయితీ కూడా మొదట్లోనే విడుదల చేసింది.

– బాలప్రసాద్, ఎండీ, సత్యదేవ ప్రింటింగ్ క్లస్టర్, కాకినాడ

భవిష్యత్ అంతా పారిశ్రామిక క్లస్టర్లదే..



భవిష్యత్ అంతా క్లస్టర్లదే. చిన్నచిన్న పారిశ్రామికవేత్తలు ఒకేచోట కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సేవలందుకోవచ్చు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ తొలి నుంచీ ప్రోత్సాహాన్ని అందించడంతో ప్రింటింగ్ క్లస్టర్ దాదాపు సిద్ధమైంది.

– టి.మురళి, జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, కాకినాడ